క్లుప్తంగా

అభినందన



అచ్చెన్నాయుడును అభినందిస్తున్న మాజీ ఎంపీ బెల్లాన

రేగిడి: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రేగిడి మండలం వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడును మాజీ ఎంపీ బెల్లాన చంద్ర శేఖర్ అభినందించారు. విజయనగరం జిల్లా, చీపురుపల్లిలోని తన నివాసానికి గురువారం వచ్చిన అచ్చెన్నాయుడును మాజీ ఎంపీ బెల్లాన అభినందించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘనంగా నివాళులు



ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి తదితరులు

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ 94వ వర్ధంతి గురువారం నిర్వహించారు. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, పాఠకులు, విద్యార్థులంతా కలిసి ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశ స్వాతంత్ర్యానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగిన ఆజాద్ జీవితాన్ని యువత, విద్యార్థులంతా ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనుల నాణ్యత పరిశీలన



కామన్నవలసలో సీసీ రోడ్డు నాణ్యత తనిఖీ చేస్తున్న ఇంజినీర్లు

బాడంగి: మండలంలోని మల్లంపేట, గూడెపువలస, అల్లువానివలస, రావివలస, పిన్నవలస, కామన్నవలస గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల నాణ్యతను క్యూసీ(క్వాలిటీ కంట్రోల్) డీఈఈ వి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారుల బృందం గురువారం తనిఖీ చేశారు. పూర్తయిన రోడ్లు, కాలువల నమూనాలను సేకరించి, నాణ్యత పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో జేఈ శ్రీనివాసరావు, పీఆర్ డీఈఈ సీహెచ్ అప్పారావు, జేఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో ఫారంపాండ్‌ల నిర్మాణం



ఫారంపాండ్‌ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

బాడంగి: ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా మండలంలోని పూడివలస, డొంకినవలస గ్రామాల్లో ఫారంపాండ్‌ల నిర్మాణం చురుగ్గా జరుగుతున్నాయి. తొలి విడతలో 45 పనులు, మలి విడతలో 15 పనులు మంజూరయ్యాయని, త్వరితగతిన పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లింగోద్భవం



రాజాం సిటీ: బియ్యంతో కప్పిన శివలింగంపై ఓం ఆకారంలో పుష్పాలతో అలంకరించిన దృశ్యం

రాజాం సిటీ: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివాలయాల్లో బుధవారం అర్ధరాత్రి లింగోద్భవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గాయత్రి కాలనీలోని కాశీవిశ్వేశ్వరాలయంలో శివలింగానికి బియ్యంతో అభిషేకించారు. బియ్యంతో కప్పిన తర్వాత పుష్పాలతో శివలింగాన్ని అందంగా అలంకరించారు.

- ప్రకృతి వ్యవసాయ కషాయాలతో చీడపీడల నివారణ
- తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంట, అధిక దిగుబడులు
- ఇంటి వద్దనే సులభంగా తయారీ కూడా..
- వినియోగానికి ఆసక్తి చూపిస్తున్న రైతులు

కషాయాలే.. శ్రీరామరక్ష!



రేగిడిలో కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: రసాయన ఎరువుల వినియోగంతో అటు రైతులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం బారినపడి ఆస్పత్రి పాలవుతున్నారు. మరో వైపు ఎరువుల కృత్రిమ కొరతతో సాగుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎరువుల కొరతను అధిగమించడంతో పాటు మంచి ఫలసాయం పొందేందుకు అన్నదాతలంతా ప్రకృతి సేద్యం అవలంబించడం ప్రారంభించారు. ముఖ్యంగా ఎరువుల కొరతను ఎదుర్కొనేందుకు ప్రకృతి వ్యవసాయ విధానాలు ఉపయోగపడుతున్నాయి. ఇంటి వద్దే సులభంగా జీవామృతాలు, కషాయాలు, ద్రావణాలు తయారు చేసుకుని వాటిని పంటలకు వినియోగించడం ద్వారా పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్లు నివారించుకుని, మంచి ఫలితాలు పొందుతున్నారు.

3 వేల ఎకరాల్లో ప్రకృతి సేద్యం..

గత ఖరీఫ్ సీజన్‌లో రాజాం నియోజకవర్గంలో మూడు వేల ఎకరాల్లో అధికారికంగా ప్రకృతి వ్యవసాయం జరిగింది. అనధికారికంగా మరో మూడు వేల ఎకరాలకు పైబడి పొలాల్లో ప్రకృతి సేద్యం జరిగిందని సమాచారం. 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఈ సాగు రాజాం మండలంలోని రెండు, మూడు గ్రామాల్లో ప్రారంభించగా, అనతి కాలంలోనే సాగు విస్తీర్ణం అమాంతం పెరిగింది. వేసవిలో రైతులు ముందుగానే ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఎరువుల తయారీకి ముడిసరుకులను సిద్ధం చేసుకుంటున్నారు. రబీ సీజన్‌లో మొక్కజొన్న పంటతో పాటు కూరగాయల సాగుకు ఈ ఎరువుల వినియోగంపై దృష్టి సారిస్తున్నారు.

జీరో పెట్టుబడి విధానం..

సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు తక్కువ పెట్టుబడితో కూడిన విధానాలు. రైతులంతా తమ ఇంటి వద్దే ఆయా పద్ధతుల ద్వారా ఎరువుల తయారీకి అవకాశం ఉంది. తక్కువ ఖర్చు, జీరో పెట్టుబడితో ఎరువులు తయారు కావడంతో రైతులంతా ప్రకృతి సాగు విధానాలపై దృష్టిసారిస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగంలో భాగంగా పిల్లిపెసర, కట్టిజనుము పంటలు సాగు చేయడం, వీటిని విత్తనాలుగా చేసి, రెట్టింపు పంటను ఖరీఫ్ సీజన్‌లో వేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు పొలాల్లో సేంద్రియ కార్బన్ శాతాన్ని పెంచుకునేందుకు మినుమలు, పెసర, ఆముదం, బొబ్బర్లు, నువ్వులు, వేరుశనగ, దనియాలు, మెంతులు, ఆవాలు, రాగులు, కొర్రలు, సామలు వంటి చిరుధాన్యాల పంటలు సాగు చేస్తున్నారు. తక్కువ నీటి వనరులున్న ప్రాంతాల్లో మండు వేసవిలో కూడా ప్రకృతి వ్యవసాయం ద్వారా ఇవి సాగులోకి వస్తున్నాయి.

ఒక్కరోజు వ్యవధిలో..

ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి కషాయాల తయారీ చాలా సులభం. ఆవుపేడ, వేపాకు, వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఆవుమూత్రం.. కషాయాల తయారీకి ప్రధాన ముడిసరుకులు. వీటిని తగిన మోతాదులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలతో వినియోగించి, ఒక్కరోజు వ్యవధిలో ఎరువులు తయారు చేసుకోవచ్చు. అగ్నిఅస్త్రం, ఘన, ద్రవ జీవామృతాలు, బీజామృతం వంటి కషాయాలు తయారు చేసి వరి, మొక్కజొన్న, చెరకు వంటి పంటలతో పాటు కూరగాయల సాగుకు వినియోగిస్తున్నారు. వీటి ద్వారా పంటలో వైవిధ్యం కనిపించడంతో పాటు పంటపొలాలు సారవంతంగా మారి నేలల్లో ఆర్గాన్, కార్బన్ ఉత్పత్తులు పెరుగుతాయి. అలాగే పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్లను నివారించుకోవచ్చు. ఫలితంగా వచ్చే పంట దిగుబడి అనేక పోషకాలు కలిగి మంచి ఆరోగ్యాన్ని అందిస్తుంది.



కషాయాల తయారీకి వినియోగించే ముడిసరుకు

రైతుల్లో అవగాహన పెరిగింది..

గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై, సేంద్రియ ఎరువుల తయారీపై రైతుల్లో అవగాహన పెరిగింది. ఆరోగ్యకరమైన ఉత్పత్తులకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఖరీఫ్ సీజన్‌లో ఘన, ద్రవ జీవామృతాలు, తూటికాడ కషాయాలకు మంచి డిమాండ్ ఉంది. సాగుకు ముందుగానే పొలాల్లో ఆవుపేడ, పెంటగత్తం, పిల్లిపెసర, కట్టిజనుమ వంటివి సాగు చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయి. – పి.రమాదేవి, ప్రకృతి వ్యవసాయం ఎల్‌వన్ అధికారిణి, రాజాం

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజాం: మండలంలోని మొగిలివలస గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం గురువారంతో ముగిసింది. ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తంతా స్వామి వారిని దర్శించుకుని, విశేష పూజలు చేశారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో సాయిరాం

రాజాం: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయాలని ఉపాధి హామీ పథకం వేతనదారులకు ఏపీవో సాయిరాం సూచించారు. మండలంలోని వీఆర్ అగ్రహారం, బొద్దాం, కంచరాం, అమరాం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. వేసవి ఎండలు అధికమవుతున్న వేళ ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్న సమయాల్లో పనులు చేసుకోవాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలిరూరల్: మండలంలోని పిరిడి గ్రామం వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పిరిడి, అలజంగి, కారాడ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ అనంతరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వంగర: మండలంలోని సీతాదేవిపురం 11 కేవీ ఫీడర్ పరిధిలోని ఇరువాడ, చంద్రంపేట, చౌదరివలస, పాతమరువాడ, కొత్త మరువాడ, సీతాదేవిపురం గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వేమిరెడ్డి సాంబశివరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అన్నదానం

రాజాం/సంతకవిటి: సంతకవిటి మండలంలోని మందరాడ గ్రామంలోని ముఖలింగేశ్వరాలయం వద్ద అన్నదాన కార్యక్రమం గురువారం నిర్వహించారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని, గ్రామానికి చెందిన బైటో భజన బృందం ఈ అన్నదానం చేశారు. మూడు వేలమందికి పైగా భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

తాగునీటి బోరు ఏర్పాటు

రాజాం సిటీ: మండలంలోని లక్ష్మీపురంలో తాగునీటి బోరు ఏర్పాటు చేశామని సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు గురువారం తెలిపారు. గ్రామంలో రూ.27 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకుకు ఈ మోటారు ద్వారా నీరు అందించి గ్రామస్తులకు నీటి సరఫరా చేయనున్నామన్నారు.

‘మత్తు’తో జీవితం చిత్తు



గంజాయి, ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్, మద్యం, సిగరెట్ వంటి మత్తు పదార్థాలతో జీవితం చిత్తు(నాశనం) అవుతుందని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్రరావు హెచ్చరించారు. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత ఎక్కువగా ఫ్యాషన్ మాయలో పడి మద్యం, గంజాయి, సిగరెట్ తాగుడుకు అలవాటు పడి జీవితం పాడు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దొంగతనాలు అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంతకవిటి ఎస్ఐ ఆర్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.
–రాజాం సిటీ

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. బొబ్బిలి పట్టణంలోని వెలమ వీధి, మెహర్ కాలనీ, కాలేజీ రోడ్డు ప్రాంతాల్లో గురువారం పర్యటించిన ఆమె ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. మురుగు కాలువల్లో పూడికలు ఎక్కువ కావడం ద్వారా రోడ్డుపైకి వస్తున్న మురుగును చూసి, పారిశుధ్య పనులు సక్రమంగా చేయించాలని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అలాగే ఇంటి ముంగిట పరిసరాలు కూడా శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.
–బొబ్బిలి

ఈ-మస్తరు విధానం అమలు చేయాలి



ఉపాధి హామీ పథకం పనుల్లో ఈ-మస్తరు విధానం అమలు చేయాలని ఏపీవో మర్రాపు సత్యవతి సూచించారు. వంగర మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి పనుల్లో చేస్తున్న ఫారంపాండ్‌ల నిర్మాణాన్ని ఆమె గురువారం పరిశీలించారు. మండలానికి 175 ఫారంపాండ్‌ల నిర్మాణ లక్ష్యం కాగా తొలి విడతలో 75 నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశామని, ప్రస్తుతం ఆ పనులు జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. నిర్దేశితల కొలతల ప్రకారం పనులు చేయిస్తూ వేతనదారుకు రోజుకు రూ.300 గిట్టుబాటు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు ప్రథమ చికిత్స కిట్ కూడా ఉంచుకోవాలని తెలిపారు.
–వంగర

వైద్య శిబిరం ఏర్పాటు



వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

వంగర: మండలంలోని సంగాం గ్రామంలో పవిత్ర సంగమేశ్వరస్వామి పుణ్యక్షేత్రం వద్ద ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఏదైనా ఆరోగ్య సమస్యతో శిబిరానికి వచ్చిన వారికి సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

చురుగ్గా సీసీ రోడ్ల నిర్మాణం



వన్నలిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణం

రేగిడి: మండలంలోని వన్నలి, బూరాడ, చిన్నశిర్లాం, అప్పాపురం, మజ్జిరాముడుపేట తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణం చాలా చురుగ్గా జరుగుతున్నాయి. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అందించడంతో ఈ పనులు చేయిస్తున్నారు. పంచాయతీరాజ్ జేఈ రియాజ్ సీసీ రోడ్లను, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ కాలువల నిర్మాణంను గురువారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 గంటల నుంచే పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, ఓటుహక్కు వినియోగించుకున్నారు. రేగిడి మండలంలో 96 మందికి గాను 94 మంది, సంతకవిటి మండలంలో 115 మందికి గాను 111 మంది, రాజాం మండలంలో 322 మందికి గాను 310 మంది, వంగర మండలంలో 61 మందికి 57 మంది, బొబ్బిలి మండలంలో 579 మందికి గాను 543 మంది, తెర్లాం మండలంలో 82 మందిగాను 77 మంది, బాడంగి మండలంలో 61 మందికి గాను 60 మంది, రామభద్రపురం మండలంలో 81 మందికి గాను 77 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ పూర్తయిన అనంతరం బ్యాలెట్ బాక్సులను సిబ్బంది స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు.
–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రేగిడిలో బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలిస్తున్న సిబ్బంది



రామభద్రపురం: ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చొన్న ఓటర్లు



రాజాంలో పోలింగ్ కేంద్రం వద్ద వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో సత్యవాణి



బొబ్బిలి: పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న జేసీ సేతుమాధవన్, ఆర్డీవో రామ్మోహనరావు